ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

మహబూబాబాద్
శనివారం 1 జూన్ 2024


వీరారం తండా అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ (ఫైల్)


అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన బంగారిగూడెం తండా ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ వేస్తున్న దృశ్యం (ఫైల్)

కొత్త సొబగులు

- అమ్మ ఆదర్శ పాఠశాలలతో మారనున్న రూపురేఖలు
- జిల్లాలో తొలివిడతలో 438 స్కూళ్ల ఎంపిక
- విద్యార్థులకు డిజిటల్ బోధన
- మౌలిక వసతుల కల్పనకు వేగంగా పనులు
- 25 శాతం నిధులతో 100 శాతం పనుల పూర్తి ఎలా!?

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 31 : జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలలు కొత్త సొబగులు సంతరించుకుంటున్నాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి, అమలు చేసేందుకు వేగంగా ముందుకు సాగుతోంది. ప్రైవేటు పాఠశాలల తరహాలో సర్కార్ స్కూళ్లను ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర సర్కార్ ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమాన్ని రూపొందించింది.

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు-676, ప్రాథమికోన్నత పాఠశాలలు-120, ఉన్నత పాఠశాలలు-102 కలిసి మొత్తం 898 పాఠశాలలున్నాయి. వాటిల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతలో 438 స్కూళ్లను ఎంపిక చేసి, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆయా బడుల్లో సకల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

తొలి విడతలో ఇలా..

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు-676, ప్రాథమికోన్నత పాఠశాలలు-120, ఉన్నత పాఠశాలలు-102 మొత్తం 898 పాఠశాలలున్నాయి. వాటిల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా తొలి విడతలో 438 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపడుతన్నారు. బయ్యారం మండలం-35, చిన్నగూడూరు-4, దంతాలపల్లి-13, డోర్నకల్-20, గంగారం-13, గార్ల-28, గూడూరు-33, ఇనుగుర్తి-12, కేసముద్రం-32, కొత్తగూడ-24, కురవి-34, మహబూబాబాద్-52, మరిపెడ-28, నర్సింహులపేట-22, నెల్లికుదురు-31, పెద్దవంగర-16, సీరోలు-13, తొర్రూరు-28 వెరసీ 438 అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికయ్యాయి.

ముమ్మరంగా పనులు..

అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 898 ప్రభుత్వ పాఠశాలలుండగా, తొలి విడతలో 438 స్కూళ్లను అధికారులు ఎంపిక చేశారు. పాఠశాలల్లో మౌళిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తరగతి గదులు, ఫర్నీచర్, నిరంతర నీటి సరఫరా, మరుగుదొడ్లు, తాగునీరు, పెయింటింగ్, మరమ్మతులు, బోర్డులు, ప్రహరీలు, వంటగదులు, డైనింగ్‌హాల్, డిజిటల్ తరగతులు తదితర వసతులు అందుబాటులో ఉండబోతున్నాయి.


కురవి మండలం భద్రుతండాలో కొనసాగుతున్న వాటర్ సంపు పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నరసింహస్వామి

కార్యక్రమం అమలు కోసం బ్యాంకు ఖాతాలు..

అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం అమలు కోసం ఏదైనా జాతీయ బ్యాంకులో ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) వీవోఏతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ బ్యాంకులో జాయింట్ అకౌంట్ తీశారు. ఈ అకౌంట్‌లో జమ అయిన నిధులతో పాఠశాలలో నీటివసతి, టాయిలెట్లు, విద్యుత్‌సరఫరా, పాఠశాల మరమ్మతులు చేపడుతున్నారు. పాఠశాలల అభివృద్ధి అంచనా వ్యయంలో కొంత మొత్తం 25శాతం నిదులు రివాల్వింగ్ ఫండ్ రూపంలో ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ నిధులు ఖర్చు చేయగానే తిరిగి అంత మేరకు ఎంబీ రికార్డు ఆధారంగా నిధులను విడుదల చేస్తారు. పాఠశాల నిర్వహణ కమిటీ తీర్మాణం చేసి నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు..

జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన స్కూళ్లలో కొనసాగుతున్న పనులను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి తొలివిడతలో ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నిరంతరం జిల్లా అదనపు కలెక్టర్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు, ఎంఈవోలు, నోడల్ ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్‌లు నిర్వహిస్తూ- త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన : రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి



అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌళిక వసతులు కల్పించబడి ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన జరగనుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్ది డిజిటల్ బోధన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. పాఠశాలల ప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలలు అన్ని హంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడి ఆహ్లాదమైన వాతావరణంలో విద్యాబోధన అందించేందుకు ముందుకు సాగుతున్నాం.

పనులకు నిధుల లేమి..?

విద్యాసంవత్సరం ఆరంభం జూన్ 12 నాటికి పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలకు నిధుల లేమి వెంటాడుతోందనే చర్చలు వినిపిస్తున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన బడుల్లో చేపడుతున్న అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు ఇప్పటి వరకు 25 శాతం నిధుల మాత్రమే జమ అయ్యాయని ప్రధానోపాధ్యా యులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. వచ్చినవి 25 శాతం నిధులు కాగా, కొన్ని పాఠశాలల్లో 50 శాతానికి పైగా పనులు పూర్తయినా వాటికి సరిపడా నిధులు జమ కాక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. పూర్తి స్థాయిలో పనులు జరగాలంటే కేటాయించిన నిధులు మొత్తం విడుదల చేస్తేనే పూర్తి చేయగలం తప్ప.. తాము ఏమిచేయలేమని చేతులెత్తేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పాఠశాలలకు కేటాయించిన నిధులు మంజూరు చేస్తే తప్ప చేపడుతున్న పనులు పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి అయ్యేలా లేవని చెప్పకనే చెప్పవచ్చు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలి

- జిల్లాలో 12 ఎగ్జామ్ సెంటర్ల ఏర్పాటు
- హాజరుకాన్ను 4,412 మంది అభ్యర్థులు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 9వ తేదీన జరగనున్న గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4,412 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మూడుకిలో మీటర్ల మేర 144 సెక్షన్ అమలు చేస్తామన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా సౌకర్యాలు కల్పించామన్నారు. పరీక్ష నిర్వహణ విభాగాల అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలని ఆదేశించారు. నోడల్ అధికారి ఆధ్వర్యంలో పోలీస్, బయోమెట్రిక్, ఇన్విజిలెటర్లకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పొ, ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లా అధికారులు కళావతి బాయి, రామారావు, నరేష్, సత్యనారాయణ,శ్రీనివాసరావు, డీఎం శివప్రసాద్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, భద్రకాళి పాల్గొన్నారు.


విద్య హెర్బ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మెయిన్‌గేటు ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

ఘాటు వాయువుతో ప్రజల ఉక్కిరిబిక్కిరి

- విద్య హెర్బ్స్ కంపెనీని మూసి వేయాలని ప్రజల ఆందోళన
- మరిపెడలో పోలీసుల జోక్యంతో తాత్కాలికంగా మూసివేత

మరిపెడ, మే 31 : దేశ విదేశాలకు అయిల్ ఉత్పత్తులను సరఫరా చేసే మరిపెడలోని విద్య హెర్బ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మూసి వేయాలని ప్రజలు శుక్రవారం ఆందోళనకు దిగారు. తెల్లవారు జాము నుంచి ఆ కంపెనీ మెయిన్‌గేటు వద్దకు వందలాది మంది చేరుకొని, కంపెనీ ఉద్యోగులతో వాగ్వావాదానికి దిగారు. ఈ కంపెనీలో మిరప, మిరియాలు, దాల్చిన చెక్క, వోమా, జిలకరమెంతులు తదితర వాటి నుంచి అయిల్‌ను తయారు చేసి దేశవిదేశాలకు సరఫరా చేస్తున్నారు. కంపెనీ నుంచి గురువారం రాత్రి మంటతో కూడిన ఘాటైన వాయివు గాలిలో కలవడంతో మరిపెడకు చెందిన వృద్ధులు, పిల్లలు, దీర్ఘ కాలికవ్యాధులతో బాధపడుతున్నవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగ్రహించిన స్థానికులు కంపెనీ వద్దకు చేరుకుని వెంటనే కంపెనీని మూసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆందోళన చేశారు. ఈ క్రమంలో కంపెనీ ఉద్యోగులపై చేయిచేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. సీఐ హథిరామ్‌నాయక్, ఎస్సైలు తహెర్‌బాబు, సంతోశ్ కంపెనీ మేనేజర్, ఆందోళన కారులతో వేర్వేరుగా మాట్లాడారు. ప్రజల ఆందోళన దృష్ట్యా కంపెనీ ఉత్పత్తుల తయారీని నిలిపివేయాలని వారు సూచించారు. దీంతో ఉద్యోగులు మెయిన్ గేట్‌కు తాళం వేసి మూసివేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, బీఆర్‌ఎస్ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

పొగాకు బారిన పడి ప్రాణాలు కోల్పోవద్దు

- డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి


సమావేశంలో మాట్లాడుతున్న కళావతిబాయి

నెహ్రూసెంటర్, మే 31 : ప్రజలు పొగాకు బారినపడి.. అనారోగ్యానికి గురై, ప్రాణాలు కోల్పోవద్దని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి సూచించారు. జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని' పురస్కరించుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిగరేట్లు, బీడీలు, చుట్టల రూపం లో పొగాకు బారిన పడి రోగాలను కొని తెచ్చుకోవద్దన్నారు. పొగ సేవించడం వల్ల చాలా మందికి వ్యసనంగా మారిందని చెప్పారు. వాటి వల్ల కలిగే దుష్ప్రభావాల వల్ల పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందన్నారు. పొగాకు నుంచి బయట పడడం కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. పొగాకును సేవించేవారిలో అత్యధికంగా యువత ఉందని వారివల్ల కుటుంబం నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా పొగా కు వల్ల కలిగే అనర్థాల పట్ల సరైన అవగాహనతో ఉండి తమతమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. సమావేశంలో సుధీర్‌రెడ్డి, ప్రసాద్, మహేందర్‌రెడ్డి, కేవీ రాజు, గీత, మంగమ్మ, శ్రీనివాస్, రవికుమార్, ఫైమోద్దీన్, లింగారెడ్డి, నీలమా, శ్వేత, అశోక్, రుక్మోద్దీన్, సౌమిత్, వసంత, రాజ్‌కుమార్, సావిత్రి, అరుణ్ పాల్గొన్నారు.


'పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి'

మహబూబాబాద్ టౌన్ : ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగించే పొగాకు ఉత్పత్తులను పూర్తిస్థాయిలో నిషేధించాలని ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ కోరారు. మహబూబాబాద్ శివారు హస్తినాపురంకాలనీలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగతాగే అలవాటు వారి జీవితానికి పొగ పెడుతుందని, దానిద్వారా శ్వాసకోశ వ్యాధులు, లంగ్ క్యాన్సర్లు, గుండెజబ్బుల బారిన పడుతున్నారని చెప్పారు. సీనియర్ న్యాయవాది కొండబత్తుల యాదగిరి, గుంజె హన్మంతు, గీసుకొండ శేఖర్, ఏనుగుతల ఉప్పలయ్య, కేదాసు వాసుదేవ్, ఏలేటి రమేష్, సహజ పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘాలకు ఎన్నికలు

- 21 మత్స్య సహకార సంఘాలకు ఈనెల 6వ తేదీ నుంచి 19 వరకు ఎన్నికలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 31 : తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఉత్తర్వుల మేరకు మహబూబాబాద్ జిల్లాలోని 21 మత్స్య సహకార సంఘాలకు ఈనెల 6వ తేదీ నుంచి 19 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి ఎన్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



మిగిలిన సహకార సంఘాలకు విడతల వారీగా ఎలక్షన్లు జరుపుతామని తెలిపారు. సహకార సంఘాల చట్టం-1964 ప్రకారం. కమిటీ పదవీకాలం ముగియడానికి 60 రోజుల ముందుగా ఆయా సదరు సహకార సంఘాల ఎన్నికలకు ప్రపోజల్స్ పంపాల్సి ఉందని ఆయన వివరించారు. పదవీకాలం ముగుస్తున్న సహకార సంఘాలకు సంబంధిత అధికారికి సమర్పించాలన్నారు. 6న డీఎఫ్‌టీఎస్ మహబూబాబాద్ సంఘానికి, 10న ఎఫ్‌సీఎస్ ఎడ్జెర్ల, టీఎఫ్‌సీఎస్ గోపాలపురం, టీఎఫ్‌సీఎస్ మడగూడ, 11న పీఎఫ్‌సీఎస్ తాటివారివేంపల్లికి, ఎఫ్‌డబ్ల్యూసీఎస్ కేసముద్రం సంఘానికి, టీఎఫ్‌సీఎస్ దుబ్బగూడెం, బావురుగొండ, మాచర్ల, కోమట్లగూడెం, గూడూరు ఎఫ్‌సీఎస్ అమ్మపాలెం, 14న టీఎఫ్‌సీఎస్ అయోధ్యపురం, కంబాలపల్లి, మర్రిగూడెం, సీతనాగరం, కోట్యానాయక్‌తండ, 16న ఎఫ్‌ఎంసీఎస్ లిమిటెడ్ మహబూబాబాద్, 17న టీఎఫ్‌సీఎస్ చిన్న ఎలాపూర్, 18న టీఎఫ్‌సీఎస్ లిమిటెడ్ బ్రహ్మణపల్లి, 19న టీఎఫ్‌సీఎస్ మర్రిమిట్ట సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికలు అయినా మూడ్రోజుల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీలను ఎన్నుకుంటారు.

పోడు పట్టాలకు రుణాలు మంజూరు చేయాలి

అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం డిమాండ్


పందెం గ్రామంలో మాట్లాడుతున్న పూనెం ప్రభాకర్

గంగారం, మే31 : ప్రభుత్వం ఇచ్చిన పోడుపట్టాలకు రుణాలను మంజూరు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పందెం గ్రామంలో శుక్రవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ప్రతీ గిరిజన రైతుకు ఆహార పంటలకుగాను రూ.30 వేలు, వాణిజ్య పంటలకు రూ. 50 వేల రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోకపోవటంతో మండలంలో వడ్డీవ్యాపారులు పెట్టుబడి రూపంలో రైతుల శ్రమను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. కల్తీలేని విత్తనాలను యాభై శాతం సబ్సిడీపై పంపిణీ చేయాలని కోరారు. మండలంలో ఎటువంటి లైసెన్సులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఎరువుల వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు రైతుల రుణమాఫీ చేయకపోవటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. గంగారం కొత్తగూడ మండలాలలో పోడు రైతులకు రుణాలు ఇవ్వక పోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జోగా రామయ్య, వెంకటయ్య, హనుమంతరావు, లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

44.6 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు

మానుకోటలో రోడ్లపై నీరు చల్లిన మునిసిపల్ అధికారులు



మానుకోట పట్టణంలో రోడ్లపై నీరు చల్లిస్తున్న పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, మే 31 : రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మండుతున్న ఎండలు, వడగాలులతో ప్రజలు విస్తుపోతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం 44.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, అత్యల్పంగా 28.2 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈనెల 4వ తేదీ వరకు ఎండలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఈ తరుణంలో ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు జిల్లాలోని మునిసిపాలిటీల్లో అధికారులు రోడ్లపై నీరు చల్లుతున్నారు. గురువారం డోర్నకల్ మునిసిపాలిటీలోని పలు వీధుల్లో అధికారులు ట్యాంకర్లతో నీరు చల్లించగా, తాజాగా శుక్రవారం సాయంత్రం మానుకోట పట్టణంలోని మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల్లో ట్యాంకర్లతో నీటిని చల్లించారు.

ఆర్థిక ఇబ్బందులతో హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

నర్సింహనగర్‌లో ఘటన


మనోహర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మే 31 : ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఓ హెడ్‌కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు నర్సింహనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం. జిల్లాలోని గార్ల మండల కేంద్రానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ బత్తిని మనోహర్ (45) గత కొంతకాలంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో నివాసముంటూ మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో కంట్రోల్ రూంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ అవసరాలు, కుమారుల ఉన్నత చదువుల కోసం సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30లక్షల వరకు అప్పుచేశాడు. కుమారులిద్దరూ ఉద్యోగంలో స్థిరపడకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో శుక్రవారం ఉదయం నర్సింహనగర్ కాలనీలో ఓ వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బత్తిని మనోహర్‌గా గుర్తించారు. వెంటనే మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంజలి, కుమారులు సంపత్, శ్రీకర్ ఉన్నారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆస్పత్రికి చేరుకుని మనోహర్ మృతదేహాంను సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా, తక్షణ సాయం కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. మృతుడి భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

నాసీరకం విత్తనాలు అమ్మితే..

లైసెన్స్‌ల రద్దు

- ఏడీఏ లక్ష్మీనారాయణ, సీఐ దేవేందర్

వివరాలు 8లో..



పన్నుల వసూళ్లకు సిబ్బంది నియామకం

వరంగల్ కార్పొరేషన్, మే 31: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఎలాంటి బిల్లులు వసూలు చేసే అర్హత ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు, ప్రైవేటు ఉద్యోగులకు లేదని సీడీఎంఏ హైదరాబాద్ నుంచి వరంగల్ బల్దియా కార్యాలయానికి సర్క్యులర్ అందిన విషయం తెలిసిందే. కాగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మునిసిపల్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వసూలు చేసిన డబ్బులను స్వప్రయోజనాల కోసం వాడుకుని చేతులెత్తేసినట్టు హైదరాబాద్‌కు ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు బల్దియా పరిధిలో పన్నులు వసూలు చేస్తున్న సిబ్బందిని తొలగించారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో డివిజన్‌కు ఒకరి చొప్పున 66 మంది, ఈ సేవా కేంద్రాలలో బిల్లులు వసూలు చేసేందుకు 10 మందిని నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రెవెన్యూ విభాగంలో పని చేసి వీఆర్ఎలు, వీఆర్‌వోలుగా పని చేసిన వారిని ప్రభుత్వం పలు మున్సిపాలిటీలకు నియమించింది. కాగా, కొత్తగా నియమించబడిన వారు బిల్ కలెక్టర్లు, ఈ సేవా కేంద్రాల్లో వార్డు అధికారులుగా పని చేస్తారు. కాగా, కమిషనర్ నియమించిన వారి పేర్లతో కూడిన జాబితాను అధికారికంగా విడుదల చేశారు. అయితే తొలగించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొదట ఏ విభాగంలో నియమించబడ్డారో అదే స్థానానికి పంపిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఎక్కువ మంది శానిటేషన్ విభాగంలో పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లు ఉండడంతో తేలు కుట్టిన దొంగల్లా కొట్టుమిట్టాడుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మే 31: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్‌ఐ మునీరుల్లా, ఏఎస్‌ఐలు సమ్మలాల్, శ్యామ్‌సుందర్, సమ్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ యాకూబ్‌రెడ్డిలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. కుటుంబసభ్యులు ఇచ్చిన సహకారంతో పోలీసులు వారి విధుల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం, యోగం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీధర్, స్పర్జన్‌రాజ్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్‌కుమార్



హసన్‌పర్తి, మే 31: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన రౌతు రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన డీబీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రమేశ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన వారికి ప్రాధాన్యం కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్ (దేవన్నపేట), రాష్ట్ర కమిటీ సభ్యులుగా బొర్ర సంపూర్ణ (హసన్‌పర్తి), మేకల అనిత (హసన్‌పర్తి), భిక్షపతి, కొమ్ముల కరుణాకర్, సురేష్, విజయకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో డీబీఎఫ్ భాగస్వామ్యం ఉంటుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు, విద్యా చైతన్య ఉద్యమాలను చేపడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి




ఐలయ్య (ఫైల్)

చెన్నారావుపేట, మే 31: వడదెబ్బతో వృద్ధుడు గురువారం రాత్రి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. పల్లకొండ ఐలయ్య(75) వడ పందుల కాపరిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య గతంలోనే చనిపోగా, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే గురువారం పందులను మేపడానికి ఆరు బయటకు తీసుకెళ్లాడు. రోజంతా ఎండలోనే ఉన్నాడు. సాయంత్రం ఇంటికి రాగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరోచనాలు కావటంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తరలించారు. అనంతరం ఆస్పత్రి తరలించేందుకు యత్నింస్తుండగా అప్పటికే మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఏకలవ్య సంఘం బాధ్యులు రూ.3 వేలను ఆర్థికసాయం అందించారు. మండల అధ్యక్షుడు పులిచేరు జంపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లకొండ తిరుపతి, కార్యదర్శి రాయపురి శ్రీను, పల్లకొండ కుమారస్వామి, వెంకటేష్, మల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.











తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

- వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
- అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
- కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్లు తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

- టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిలరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్


మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

- అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

- అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
- మహేష్ కుమార్ గౌడ్
- సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మీ, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాశ్ కొడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

- అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
- ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
- లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
- 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
- విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పత్తిపాక రోడ్డు విస్తరణ పనులు స్లో

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న వైనం
- దారికి ఇరువైపుల గోతులు తవ్వి వదిలేయడంతో ఇక్కట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, మే 31 : జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్డు విస్తరణ (వెడల్పు) పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు, వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఆ రహదారి మీదుగా వెళ్లాలంటే వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపుల గోతుల తవ్వి ఉండడంతో అందులో ఎక్కడా పడి పోతామోనని ఆందోళన చెందుతున్నారు. కొత్తగా సైడ్ కాల్వల నిర్మాణం కాకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. రోడ్డు కిరువైపుల గుంతలు, ఉన్నరోడ్డు సరిగా లేకపోవడంతో ఆ గుంతల్లో నీరు నిలిచిపోతోంది. వర్షకాలం వస్తే ఎక్కడా నీరు ఉందో, ఎక్కడా రోడ్డు ఉందో తెలియని పరిస్థితి. నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులతో పత్తిపాక, మంగలికాలనీ, రజాలిపేట వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగేళ్ల క్రితమే..

దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైన మహబూబాబాద్ పట్టణంలో రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని కొత్త పాతబజారుల్లో ప్రధాన రహదారుల్లో రోడ్లను వెడల్పు చేయడంతో పాటు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, ప్రధాన కూడళ్లలో జంక్షన్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక మీదుగా రజాలిపేట బైపాస్‌రోడ్ వరకు 2.2 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణకు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.2.50 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అన్ని రోడ్లలాగానే రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, పైపులైన్, నూతన విద్యుత్ పోళ్లు, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. నాలుగేళ్ల క్రితం 80 పీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు చేయాలని నిర్ణయించి పనులకు శంకుస్థాపన చేశారు. అనేక మంది ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఉందని స్థానికులు అభ్యంతరాలు తెలపడంతో కొన్నాళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత 66 పీట్ల వరకు కుదించి పనులకు శ్రీకారం చుట్టారు. ఆపై కూడా మళ్లీ కొంతమంది స్టే తెచ్చుకోవడంతో అక్కడక్కడ విస్తరణ పనులకు బ్రేక్ పడుతుండడంతో పనులు ఆగుతూ.. సాగుతూ..నత్తనడకన కొనసాగుతున్నాయి.


రహదారి విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డుపైనే నిలిచిన నీరు


నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వైపు రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డు కిరువైపుల తవ్విన గోతులు

రోడ్డు కిరువైపుల తవ్వి వదిలేయడంతో..

జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్ విస్తరణ పనులు నాలుగు సంవత్సరాలుగా కొసాగుతూ వస్తున్నాయి. కొన్ని చోట్ల రోడ్డు కిరువైపుల గుంతలు తవ్వి వదిలేయగా, మరి కొన్ని చోట్ల కంకర పరిచారు. విస్తరణలో భాగంగా రోడ్డు కిరువైపుల పెద్దగా గోతులు తవ్వడంతో రోడ్డు వెంటఉన్న షాపులకు, ఇళ్లకు మెట్లు లేకపోవడంతో వారు తాత్కాలికంగా కర్రల సాయంతో ఏర్పాటు చేసుకున్నారు. దానిపై నడుచుకుంటు వెళ్లిన సమయాల్లో అనేక మంది కిందపడి ఆస్పత్రుల పాలైన సంఘటనలు లేకపోలేదు. రోడ్డు కిరువైపుల తవ్వడం, ఉన్న రోడ్డు కూడా సరిగా లేకపోవడంతో వర్షం వస్తే గుంతల్లో నీరు నిలుస్తుంది. దీంతో వాహనదారులు ఎక్కడా నీరు ఉంది, ఎక్కడా రోడ్డు ఉందో తెలియక ఇబ్బందులు పడుతూ వాహనాలు నడుపుతున్నారు. ఈ క్రమంలో వాహనదారులు సైతం కిందపడ్డ దాఖాలాలు ఉన్నాయి. ఆ రోడ్డు గుండా పత్తిపాక, మంగలికాలనీ, రజాలిపేట, మల్యాల, బేతోలు, కురవికి వెళ్లే వారు నిత్యం రాకపోకలు సాగిస్తారు. ఆ రోడ్డుపై నుంచి వెళ్లే స్థానికులు,పాదాచారులు, వాహనదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. వారంతా నాలుగు సంవత్సరాలుగా పడరాని పాట్లు పడుతున్నారు. ఈ రోడ్డు పూర్తి కావడానికి ఎంత సమయం పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

- పల్లపు రాములు, పత్తిపాక



పత్తిపాక రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో పత్తిపాక, మంగలి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెహ్రూ సెంటర్ నుంచి ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగడం, రోడ్డు కిరువైపుల గోతులు తవ్వి వదిలేయడంతో ఆ రోడ్డు వెంటనడిచే. పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి తక్షణమే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

రుణమాఫీని అమలు చేయాలి

- ఏఐకేఎంఎస్ డిమాండ్

కేసముద్రం, మే 31 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు భట్టు నాగేశ్వర్‌రావు, కొట్టం అంజయ్య మాట్లాడారు. అన్నిరకాల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై రైతులకు ఇవ్వాలని కోరారు. విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో నకిలీ విత్తనాలను ప్రైవేటు కంపెనీలు రైతులకు అంటగడుతున్నాయని, తద్వారా రైతులు నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బెజ్జంకి బ్రహ్మచారి, అంబటి నాగమల్లు, వాంకుడోత్ హథిరామ్, బండి రాజు, డి.రాజు, కొమురయ్య, కొమ్మనబోయిన మల్లయ్య వీరన్న, ఓరుగంటి కృష్ణ, బెల్లి మురళి, దాసరి రాములు, లాదళ్ల సారయ్య పాల్గొన్నారు.


ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా డిమాండ్

కొత్తగూడ, మే31 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. కొత్తగూడలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి అవసరమైన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అనంతరం హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తగూడ, గంగారం మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్, డివిజన్ నాయకులు గొంది సమ్మయ్య, కంగాల పాపయ్య, అప్పారావు, సూరి, రామయ్య పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పదు

- జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


విదవీవిరమణ పొందిన ట్రాఫిక్ ఎస్సైను సన్మానించి, మెమొంటో అందిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మే 31 : ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పదని, విధుల్లో ఉన్నప్పుడు అందించిన సేవ లేగుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహించిన పి.శ్యాంసుందర్ శుక్రవారం పదవీవిరమణ ఆయనను శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ శ్యాంసుందర్ కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు 40 సంవత్సరాలు వివిధ హోదాల్లో పనిచేశారని చెప్పారు. అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని చెప్పారు. పదవీ విరమణ అనంతరం ఎలాంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుటుంబసభ్యులతో శేషజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

నంద్యాతండాలో ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన గ్రామపంచాయతీ ట్రాక్టర్

నెల్లికుదురు, మే 31 : గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటన బంజర శివారు నంద్యాతండాలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామపంచాయతీ ట్రాక్టర్ బంజర నుంచి నంద్యతండాకు చెత్తను తరలించడానికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి, రోడ్డు పక్కన బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్పగాయ్యాయి. పెనుప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

- మానుకోట ఆర్టీసీ డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, మే 31 : ఉద్యోగులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో పని చేసిన సూపరింటెంట్ (టీ) డి.వెంకన్న, డిప్యూటీ సూపరింటెంట్ (ఎం) జగన్‌మోహన్, ఏడీసీ వెంకటేశ్వర్లు, డ్రైవర్ ఎస్ఎస్.రావు పదవీ విరమణ అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. వారిని ఆర్టీసీ అధికారులు, సిబ్బంది శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీవిరమణ అనేది సహజమని విధుల్లో ఉన్న సమయంలో ప్రజలకు మెరుగైన సేవలందించి వారి గుండెల్లో నిలవాలన్నారు. అధికారులు శ్యాం ప్రసాద్, రుక్మిణి, మల్లికార్జున్, ఈఎస్. చారి పాల్గొన్నారు.


మానుకోటలో పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎం శివప్రసాద్

శేషజీవితాన్ని ఆనందంగా గడపాలి

తొర్రూరు : ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మ అన్నారు. శుక్రవారం డిపోలో ముగ్గురు ఉద్యోగులు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా ఆర్టీసీలో ఉండి సేవలు అందించిన వారిని కొనియాడారు. ప్రతీ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం తన శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరారు. పదవి విరమణ పొందిన బి.సారయ్య, బీఎస్ చారి, హరిలాల్, శ్రీమతిలను శాలువా మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'నాసీరకం విత్తనాలు అమ్మితే లైసెన్స్‌ల రద్దు'


మానుకోటలోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే31 : నకిలీ విత్తనాలు రైతులకు అమ్మినట్లయితే విత్తన వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మహబూబాబాద్ ఏడీఏ ఎం.లక్ష్మీనారాయణ, మహబూబాబాద్ పట్టణ సీఐ దేవేందర్ హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో శుక్రవారం శ్రీబాలాజీ అగ్రిమాల్ విత్తన, పురుగుల మందుల దుకాణాన్ని ఆ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు ఖరీదులు చేసిన వెంటనే తప్పనిసరిగా బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు కానీ, వ్యవసాయాధికారులకు కానీ తెలపాలని సూచించారు. ఈ తనిఖీల్లో దుకాణంలో ఉన్న పత్తి విత్తనాలు, మిర్చి, వరి విత్తనాల ప్యాకెట్లను,సంచులను పరిశీలించారు. ప్యాకెట్లపై ముద్రించిన బ్యాచ్ నెంబర్, తయారు తేదీ, గడువు ముగింపు తేదీని, లాట్ నెంబర్, స్టాక్ రిజిస్టర్‌లలో పొందుపరిచిన లాట్‌నెంబర్లు, స్టాక్ రిజిస్టర్‌లలో పొందుపరిచిన వివరాలను, కంపెనీ ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు.

'సబ్సిడీపై ఎరువులను అందించాలి'

కొత్తగూడ, మే 31 : సబ్సిడీపై ఎరువులను రైతులకు అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బూర్క వెంకటయ్య మాట్లాడుతూ వానాకాలం సీజన్ ముందస్తుగా ప్రారంభమైనందున ప్రభుత్వం నుంచి రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను సబ్సిడీలో అందించాలని కోరారు. ప్రైవేటు కంపెనీలకు చెందిన నకిలీ విత్తనాలను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు బూర్క బుచ్చిరాములు, ప్రధాన కార్యదర్శి యాదగిరి విజెందర్, గజ్జి సోమయ్య, పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఆగబోయిన నర్సక్క, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీశైలం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేణుమాదవ్

బడిబాటను విజయవంతం చేయాలి

- ఎంపీడీవో వేణుమాదవ్

పెద్దవంగర మే 31 : ఈనెల 3వ తేదీ నుంచి 19వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వేణుమాదవ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో హెచ్ఎంలు, ఐసీడీఎస్, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యాసంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమం చేపడుతుందని, రానున్న విద్యాసంవత్సరంలో డ్రాపవుట్స్ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు హెచ్ఎంలతో పాటు అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే పలు గ్రామాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించాలని కోరారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు ప్రత్యేక శ్రద్ధ వహించి పనులను జూన్ 5 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులను అందేలా చూడాలని కోరారు. ఎంపీవో సత్యనారాయణ నోడల్ హెచ్ఎం కళాధర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు మహిళ ఆత్మహత్య

ములుగు, మే 31 : వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకు న్న సంఘటన ములుగు జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎ.వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం. వెంకటాపూర్ (రామప్ప) మండల కేంద్రానికి చెందిన మొలుగూరి దామోదర్ కుమార్తె వనశ్రీ (23)కి ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన డీకొండ శ్రీనాథ్‌తో 2021 జూన్ 21న వివాహం జరిగింది. ఒప్పందం ప్రకారం రూ.3 లక్షల నగదు, తులం బంగా రం, రూ.6 లక్షల కింద 20గుంటల భూమిని కట్నకానుకలుగా ఇచ్చారు. ప్రస్తుతం ఆ దంపతులకు 16 నెలల వయసు గల కుమారుడు ఉన్నాడు. అయితే అదనపు కట్నం కోసం భర్త శ్రీనాథ్‌తో పాటు అత్తామామలు ఉమాదేవి, రాజేంద్ర ప్రసాద్ ఆరునెలలుగా వనశ్రీని వేధిస్తున్నారు.

ఈవిషయమై జనవరి 27న పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా ఇకపై మంచిగా ఉంటామని శ్రీనాథ్, ఆయన తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. కొద్దిరోజులకే వేధింపులు మళ్లీ మొదలయ్యాయి. తల్లిదండ్రులతో ఫోన్‌లో కూడా మాట్లాడని వ్వకపోవడం తో తీవ్ర మనస్తాపానికి గురైన వనశ్రీ శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి దామోదర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీనాథ్, అత్తామామలు ఉమాదేవి, రాజేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

అందుబాటులోకి విత్తనాలు

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మే 31: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాకేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపును ఆమె శుక్రవారం తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె విత్తనాలను స్వయంగా పరిశీలించి విత్తనాలకు సం బంధించిన కంపెనీల వివరాలు, ఎమ్మార్పీ, దిగుమతి చేసుకున్న రశీదులను పరిశీలించారు. వానాకాలం పంటకు జిల్లాలో అవసరమైన విత్తనాలను అందుబాటులో స్టాకు పెట్టుకున్నామని, రైతులకు సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లాలో విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడా కొరత రాకుండా అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయం జరగకుండా నిఘా ఏర్పాటు చేశామన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ, పోలీస్ అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయొద్దని అన్నారు. ఆయా కంపెనీ లేబుల్ కలిగిన విత్తన ప్యాకెట్లనే కొనుగోలు చేయాలని, తప్పకుండా డీలర్ నుంచి రశీదు తీసుకుని పంటకాలం పూర్తయ్యేవరకు భద్రప రచుకోవాలని సూచించారు. ఆమెవెంట జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, ములుగు ఏడీ శ్రీపాల్, ఏవో సంతోష్, సిబ్బంది ఉన్నారు.

మోటార్ సైకిల్ బోల్తాపడి చిన్నారి మృతి

మంగపేట, మే 31 : ద్విచక్రవాహనం బోల్తాపడిన ఘటనలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని రమణక్కపేట వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. మొట్లగూడెం పంచాయతీ పరిధి శ్రీరామ్‌నగర్ గొత్తికోయ గుంపునకు చెందిన బాడిశ నగేష్ తన బంధువైన జానం పేట పంచాయతీ పరిధి సుందరయ్య నగర్‌కు చెందిన మాడవి జ్యోతి, ఆమె కుమార్తె ఆద్య (3)ను తీసుకొని ద్విచక్ర వాహనంపై మంగ పేటకు బయల్దేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో జ్యోతి, ఆద్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం ప్రభు త్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ చిన్నారి ఆద్య మృతి చెందింది. పరిస్థితి విషమించడంతో జ్యోతిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. జ్యోతి భర్త అజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేశారు.

రేపు మైనారిటీ వివాహ పరిచయ వేదిక

వడ్డెపల్లి, మే31 : మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 2న వరంగల్ ఎల్బీ నగర్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా దూ-బ-దూ ములాఖత్ (ఉచిత వివాహ పరిచయ వేదిక) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ అనిస్‌సిద్దిఖి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఉన్న ముస్లిం యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు : 99087 63454/98490 12987లలో సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ దామోదర్

'రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిన విత్తనాలను విక్రయించాలి'

కేసముద్రం, మే 31 : ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలనే డీలర్లు షాపుల్లో విక్రయించాలని తహసీల్దార్ దామోదర్ సూచించారు. కేసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కేసముద్రం, ఇనుగుర్తి మండలాల విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డీలర్లు రిజిష్టర్లను, స్టాక్‌బోర్డును నిర్వహించాలని, విత్తనాలు విక్రయించిన సమయంలో తప్పనిసరిగా రైతులకు బిల్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీధర్, మండల వ్యవసాయాధికారి బి.వెంకన్న, డీలర్ల సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వోలం రమేష్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

మరమ్మతు పనులను పూర్తి చేయాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


జిల్లా ఆస్పత్రి వద్ద రోడ్డు మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, మే31 : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరమ్మతు పనులను పూర్తి చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని త్వరగా పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు.

మానసకు అండగా ఉంటాం

- ఎంపీ మాలోతు కవిత


అనాథ బాలిక మానసకు రూ.5 వేల నగదును అందిస్తున్న ఎంపీ మాలోతు

కురవి, మే 31 : తల్లి మృతి చెంది అనాథగా మారిన మానసకు జీవితకాలం అండగా ఉంటామని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. శుక్రవారం కురవికి వచ్చిన కవిత మానస ఇంటికి వెళ్లి ఆమెకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. మానస బాగోగులను ప్రభుత్వం చూసుకుంటుందని, తాను చదువుకున్నంత కాలం మానసను ప్రభుత్వం చదివిస్తోందన్నారు. పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడాలని మానసకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ముత్యం వెంకన్న, నూతక్కి నర్సింహారావు, సంగెం భరత్, కొంతం విజయ్, గంగరబోయిన రఘు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

తొర్రూరు, మే 31 : పవనసుత హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం పాటిమీద ఉన్న హనుమాన్ ఆలయంలో వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు హనుమాన్ దేవాలయ కమిటీ నిర్వాహకుడు, విశ్వహిందు పరిషత్ సభ్యులు తెలిపారు. తెల్లవారు జామున 5గంటల నుండే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హారతి, ప్రసాదవితరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై హనుమాన్ కృపకుపాత్రులు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు గోపారపు నాగేశ్వర్ రావు, హరి నాగన్న, దేవరకొండ కృష్ణ ప్రసాద్, కమిటీ సభ్యులు ఉన్నారు.

పోలీసుల తనిఖీలు


వాహనదారుడి అనుమతి పత్రాలు తనిఖీ చేస్తున్న ఎస్సై జగదీష్

తొర్రూరు, మే 31 : తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తున్న నేపథ్యంలో శుక్రవారం తొర్రూరులో ఎస్సై జగదీష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. టూవీలర్, కారు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిఅనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు, హెల్మెట్‌తో వాహనాలు నడపాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాహనాలు నడపకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదనపు ఎస్సై రాంజీనాయక్, సిబ్బంది తిరుమలేష్, పరమేశ్వర్, సాయికృష్ణ ఉన్నారు.

వడదెబ్బతో ఎలక్ట్రీషియన్ మృతి

మంగపేట (ములుగు జిల్లా), మే31 : వడదెబ్బతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మండలంలోని రాజుపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దామెర రాంబాబు (50) ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిం చుకుంటున్నాడు. రోజూమాదిరిగానే ఉదయం షాపునకు వెళ్లిన ఆయన తీవ్ర మైన ఎండవేడికి అస్వస్థతకు గురయ్యాడు. స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లి బీపీ పరీక్ష చేస్తుండగానే స్పృహతప్పి పడిపోయాడు. కొద్దిసేపటికే తుదిశ్వాస విడిచాడు. రాంబాబుకు భార్య, కుమార్తె ఉన్నారు.